ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనకాపల్లి
జిల్లా వార్తలు
ఆదివారం 2 జూన్ 2024



భూచోళ్లు

అంతా కలిసి పేదల నోట్లో మట్టి కొట్టారు

- డి.పట్టా భూములు చేజిక్కించుకునేందుకు ఏడాది నుంచి వ్యూహం
- ప్రభుత్వ పెద్దల బినామీలకు రిజిస్ట్రేషన్

- వార్త 7వ పేజీలో..

సర్వే సర్వత్రా..

ఎగ్జిట్ పోల్స్‌పై ఆసక్తి

- సాయంత్రం 6.30 గంటల నుంచి టీవీలకు అతుక్కుపోయిన జనం
- లోకల్ నుంచి జాతీయ స్థాయి వరకూ 45 సంస్థల ఎగ్జిట్ పోల్స్ వెల్లడి
- కూటమి విజయం సాధిస్తుందన్న 37 సంస్థలు
- వైసీపీ నెగ్గుతుందన్న ఎనిమిది సంస్థలు
- ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 12 స్థానాల వరకూ కూటమి కైవసం చేసుకుంటుందని పలు సంస్థల అంచనా
- విశాఖపట్నం, అనకాపల్లి ఎంపీ సీట్లు కూటమి ఖాతాలోకే...
- మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు ఓడిపోబోతున్నారన్న 'ఆరా'
- విశాఖ 'నార్త్'లో టైట్ ఫైట్


విశాఖలో ఎగ్జిట్ పోల్స్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న దృశ్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అందరిలోను ఒకటే ఉత్కంఠ. రాష్ట్రంలో ఏ పార్టీ గెలుస్తుంది?, జిల్లాలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు వస్తాయి?, ఎవరు గెలుస్తారు?, ఎవరు ఓడిపోతారు?...ఎక్కడ చూసినా ఇదే చర్చ. ఈ ప్రశ్నలకు నాలుగో తేదీన సమాధానం లభించనున్నది. అయితే ఈలోగా సర్వే సంస్థలు కొంత స్పష్టత ఇచ్చాయి. దేశవ్యాప్తంగా చివరి విడత పోలింగ్ శనివారం ముగియడంతో సాయంత్రం 6.30 గంటల తరువాత వరుసగా ఒక దాని తరువాత మరొకటి ఎగ్జిట్ పోల్ వివరాలు వెల్లడించాయి. దాంతో జిల్లా వాసులు టీవీలకు అతుక్కుపోయి ఆసక్తిగా వీక్షించారు. దాదాపు 45కి పైగా సంస్థలు తాము చేపట్టిన సర్వే ఫలితాలు ప్రకటించాయి. వాటిలో 37 రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి, కేంద్రంలో ఎన్‌డీఏ అధికారంలోకి వస్తాయని తెలిపాయి. కేవలం 8 సంస్థలు మాత్రమే వైసీపీకి ఆధిక్యం లభిస్తుందని వెల్లడించాయి.

కొన్ని నెలల క్రితం పొరుగు రాష్ట్రమైన తెలంగాణాలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోను ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు ఇలాగే వచ్చాయి. కేసీఆర్ సారథ్యం వహిస్తున్న అధికార పార్టీ బీఆర్ఎస్ ఓడిపోతుందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని సర్వే సంస్థలు తెలిపాయి. దీనిని బీఆర్ఎస్ అంగీకరించలేదు. అవన్నీ తప్పుడు సర్వేలని కేటీఆర్ కొట్టి పడేశారు. కానీ సర్వే సంస్థలు చెప్పిందే నిజమైంది.

ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోను సర్వే సంస్థలు ఏకపక్షంగా కూటమే అధికారంలోకి వస్తుందని తేల్చాయి. మొత్తం 175 అసెంబ్లీ స్థానాల్లో కూటమికి 144 సీట్లు వస్తాయని పయనీర్ సంస్థ వెల్లడించింది. కూటమి అధికారంలోకి వస్తుందని చెప్పిన సంస్థలు వైసీపీకి 60 సీట్లు వస్తాయని తేల్చాయి. ఇతర పార్టీలకు ఒకటి కంటే ఎక్కువ సీట్లు రావని పేర్కొన్నాయి. కేకే సర్వే సంస్థ అయితే కూటమికి 161 స్థానాలు వస్తాయని, వైసీపీకి కేవలం 14 సీట్లు మాత్రమే వస్తాయని వెల్లడించింది. రైజ్ సంస్థ కూటమికి 113-122, వైసీపీకి 48-60, చాణక్య స్ట్రాటజీస్ కూటమికి 114-125, వైసీపీకి 39-49, పీపుల్స్ పల్స్ సంస్థ కూటమికి 111-135, వైసీపీకి 45-60, ఆరా సంస్థ కూటమికి 71-81, వైసీపీకి 94-104 వస్తాయని ప్రకటించాయి. అలాగే చాణక్య సంస్థ వైసీపీకి 110-120, కూటమికి 55-65, జన్‌మత్ పోల్స్ వైసీపీకి 95-103, కూటమికి 65-75 సీట్లు వస్తాయని అంచనా వేశాయి.

పార్లమెంటు స్థానాల విషయానికి వస్తే...కూటమికి 21-23, వైసీపీకి 2-4 సీట్లు వస్తాయని ఇండియా టుడే వెల్లడించింది. అలాగే ఎన్‌డీటీవీ...కూటమికి 18, వైసీపీకి 7, రిపబ్లిక్ టీవీ...కూటమికి 14, వైసీపీకి 11, న్యూస్ 18 ...కూటమికి 19-22, వైసీపీకి 5-8, ఏబీబీ, సీ ఓటర్...కూటమికి 21-22, వైసీపీకి 0-4 సీట్లు వస్తాయని, ఇండియా టీవీ... కూటమికి 21 సీట్లు వస్తాయని ప్రకటించాయి.

విశాఖ జిల్లా చూసుకుంటే...

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ... మిగతా 8వ పేజీలో

రైతు మెడకు స్మార్ట్‌గా ఉచ్చు!

వ్యవసాయ మోటార్లకు విద్యుత్ మీటర్లు వద్దని రైతులు వ్యతిరేకిస్తున్నా వినని అధికారులు

- గుట్టు చప్పుడు కాకుండా బిగించేస్తున్న వైనం
- ఇప్పటికే జిల్లాలో సగానికి పైగా ఏర్పాటు
- బిల్లులు వచ్చినా ప్రభుత్వమే చెల్లిస్తుందని చెబుతున్న ఏపీఈపీడీసీఎల్
- ఉచిత విద్యుత్ అంటూనే మీటర్లు ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నిస్తున్న రైతు కార్మిక సంఘాలు


మునగపాక మండలం గణపర్తి గ్రామంలో వ్యవసాయ బోరు వద్ద స్మార్ట్ మీటరు బిగిస్తున్న దృశ్యం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో రైతులు వద్దంటున్నా వినకుండా కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లను బిగించేస్తున్నారు. ఒకవైపు ప్రభుత్వం వ్యవసాయానికి పగటిపూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ అందిస్తున్నామంటూ ప్రచారం చేసుకొంటూనే మరోవైపు వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో ఇప్పటికే వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించిన ఏపీఈపీడీసీఎల్ అధికారులు భవిష్యత్తులో రైతులకు వచ్చే బిల్లులు ప్రభుత్వమే చెల్లిస్తుందని, ఆ మొత్తాలు రైతు బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు వీలుగా కొత్తగా బ్యాంకు ఖాతాలను తెరవాలని సూచిస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో ఏపీఈపీడీసీఎల్ అధికారుల గణాంకాల ప్రకారం 24 మండలాల పరిధిలో 37,480 వ్యవసాయ మోటార్లు రైతుల పొలాల్లో ఉన్నాయి. వీటన్నింటికీ స్మార్ట్ మీటర్లు బిగించాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు పనులు ప్రారంభించి జిల్లాలో ఇప్పటికే సుమారు 18 వేలకు పైగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించినట్టు చెబుతున్నారు. అనకాపల్లి, మాడుగుల, కె.కోటపాడు, దేవరాపల్లి, మునగపాక, కశింకోట మండలాల్లో సగం మంది రైతుల పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించారు. మిగిలిన మండలాల్లో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, త్వరలో పనులు పూర్తవుతాయని ఏపీఈపీడీసీఎల్ అధికారులు చెబుతున్నారు. కాగా ఇప్పటి వరకు మీటర్లు బిగించిన రైతులకు బిల్లులు రాకపోయినా భవిష్యత్తులో ప్రతి నెలా వినియోగించిన కరెంట్‌కు బిల్లు వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే బిల్లులు రైతులకు జారీ అయినా అవి చెల్లించాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రతి నెలా బిల్లు మొత్తాన్ని రైతు బ్యాంకు ఖాతాకు ప్రభుత్వం నగదు బదిలీ చేసి రైతు వినియోగించిన విద్యుత్ బిల్లును ప్రభుత్వమే చెల్లిస్తుందని, రైతుకు భారం ఉండదని స్పష్టం చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలో 2021లో తొలుత ప్రయోగాత్మకంగా వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించారు. ఆయా రైతులకు ప్రతి నెలా రూ.3 వేలు నుంచి రూ.5 వేలు వరకు విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ప్రస్తుతానికి ఆయా బిల్లులను ప్రభుత్వమే చెల్లిస్తున్నప్పటికీ భవిష్యత్తులో విద్యుత్ సరఫరా సంస్థలు ప్రైవేటు పరమైతే రైతులపై విద్యుత్ బకాయిల భారం తప్పదనే అభిప్రాయాన్ని రైతు కార్మిక సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు నష్టం



ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెబుతున్న వైసీపీ ప్రభుత్వం రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఎందుకు బిగిస్తున్నారో సమాధానం చెప్పాలి. ఈ పరిణామంతో భవిష్యత్తులో రైతులకు తీవ్ర నష్టం జరిగే అవకాశాలు లేకపోలేదు. రైతులు విద్యుత్ మీటర్లు వద్దని చెబుతున్నా అధికారులు బలవంతంగా బిగించి వెళ్లిపోతున్నారు. రైతులు, రైతు కార్మిక సంఘాలు స్మార్ట్ మీటర్లు వద్దని వ్యతిరేకిస్తున్నా, మొండిగా ప్రభుత్వం మీటర్లు బిగించి రైతులను మోసం చేస్తోంది.

- డి.వెంకన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు, సీపీఎం

కూరగాయల ధరలు పైపైకి..

పక్షం రోజుల్లో భారీగానే పెరుగుదల


- పంటల దిగుబడి తగ్గి డిమాండ్ పెరగడమే కారణం


కూరగాయలు

అనకాపల్లి టౌన్, జూన్ 1:

కూరగాయల ధరలు పెరుగుతుండడంతో సామాన్యులపై భారం పడుతోంది. పక్షం రోజుల్లో ధరలు బాగా పెరిగాయని, ఇలా అయితే ఏం తినాలని వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో పలు జిల్లాల్లో పంటలు దెబ్బతిని దిగుబడి రాకపోవడంతో కూరగాయల డిమాండ్ మేరకు ధరలు పెరుగుతున్నాయని వర్తకులు చెబుతున్నారు.

ఉభయ తూర్పు గోదావరి జిల్లాల నుంచి అనకాపల్లి మార్కెట్‌కు నిత్యం కూరగాయలు అందుబాటులోకి వచ్చేవి. అయితే అక్కడ దిగుబడులు బాగా తగ్గడంతో అంతంత మాత్రంగానే కూరగాయలు అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతున్నాయి. దీంతో రవాణా చార్జీలన్నీ కలుపుకుంటే ధరలు తడిసిమోపుడు అవుతున్నాయి. ఉల్లిపాయలు పక్షం రోజుల క్రితం కిలో రూ.25లు ఉండగా, ప్రస్తుతం రూ.30కు చేరింది. వంకాయలు రూ.30 నుంచి రూ. 40లకు, దొండకాయలు రూ. 25 నుంచి రూ.30 లు, బెండకాయలు రూ.30 నుంచి రూ.40లు, క్యారెట్ రూ.30 నుంచి రూ. 50లు, క్యాబేజి రూ.20 నుంచి రూ.30లు, చేమదుంపలు రూ.30 నుంచి రూ.40లకు ధర పలికింది. టమాటా రూ.30 నుంచి రూ.40లు, పచ్చిమిర్చి రూ.30 నుంచి రూ.70లకు పెరగగా, బజ్జీ మిరపకాయలు కిలో రూ.90లు వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. గోరుచిక్కుడు రూ.25 నుంచి రూ.40లు, కంద దుంప రూ.40 నుంచి రూ.90లకు ధర పెరగగా, అల్లం రూ.140 నుంచి రూ.200ల వరకు ధర పెరిగింది. టమాటాలు మదనపల్లి, పుంగనూరు ప్రాంతాల నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి కాగా, కూరగాయలు రాజమండ్రి సమీపంలోని మడిక, రావులపాలెం నుంచి రాగా, పచ్చిమిర్చి ఏలూరు, శ్రీకాకుళం ప్రాంతాల నుంచి అనకాపల్లి మార్కెట్‌కు దిగుమతి ... మిగతా 8వ పేజీలో


అనకాపల్లి రింగురోడ్డులో డ్రైఫ్రూట్స్ అలంకరణలో ఆంజనేయస్వామి

వైభవంగా హనుమాన్ జయంతి

హనుమాన్ జయంతిని శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు వచ్చి స్వామివారికి పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలి

రాజకీయ నాయకులకు ఎస్పీ మురళీకృష్ణ సూచన

- శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక


మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

నర్సీపట్నం, జూన్ 1:

ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని రాజకీయ నాయకులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ కోరారు. శనివారం స్థానిక రామచంద్రా ఫంక్షన్ హాల్‌లో రాజకీయ పార్టీల నేతలతో శాంతి భద్రత పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి శనివారం సాయంత్రం ఎగ్జిట్ పోల్స్, నాలుగో తేదీన ఫలితాలు వెలువడుతున్న తరుణంలో రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సంయమనంతో ఉండాలన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి అందరూ సహకరించారని, అదే ... మిగతా 8వ పేజీలో

భద్రత కట్టుదిట్టం

- కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం


అనకాపల్లి రింగ్‌రోడ్డు కూడలిలో పోలీసుల గస్తీ

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పోలీసులు భద్రత కట్టుదిట్టం చేశారు. ఈ నెల 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఘర్షణలకు తావులేకుండా ఎస్పీ కేవీ మురళీకృష్ణ నేతృత్వంలో జిల్లా పోలీసు యంత్రాంగం ముందస్తు భద్రతా చర్యలు చేపట్టింది. జిల్లా అంతటా శనివారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు పోలీసు సెక్షన్ 30తో పాటు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసు బృందాలు గస్తీ కాస్తున్నాయి. పట్టణాలు, మండల కేంద్రాలతో పాటు సమస్యాత్మక గ్రామాల్లో ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకు పోలీసుల నిఘా కొనసాగించనున్నారు.

ఈదురుగాలుల బీభత్సం


పరవాడ మండల పరిషత్ జంక్షన్‌లో కూలిపోయిన వృక్షం

- పలుచోట్ల నేలకొరిగిన చెట్లు
- దెబ్బతిన్న అరటితోటలు
- తొమ్మిది గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ, జూన్ 1: మండల వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. గాలులతో పాటు కొద్దిపాటి వర్షం కురిసింది. అయితే విపరీతంగా ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో అరటితోటలు నేలకొరిగాయి. ఈదురుగాలులు వల్ల శుక్రవారం రాత్రి 11 గంటల నుంచి శనివారం ఉదయం ఎనిమిది గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా ఈదురుగాలుల వల్ల అరటితోటలతో పాటు బొప్పాయి తోటలు నేలకొరగడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.


పరవాడలో నేలకొరిగిన అరటితోట

పింఛన్‌కు తప్పని పాట్లు

- బ్యాంకుల వద్ద బారులుతీరిన లబ్ధిదారులు
- దూర ప్రాంతాల నుంచి వేకువజామునే కొందరు వృద్ధుల రాక
- గంటల తరబడి పడిగాపులు


నర్సీపట్నంలో పింఛన్ డబ్బులు డ్రా చేసుకునేందుకు బ్యాంకులో బారులుతీరిన లబ్ధిదారులు

నర్సీపట్నం, జూన్ 1:

మునిసిపాలిటీలో పింఛన్ లబ్ధిదారులకు ఈ నెల కూడా ఇబ్బందులు తప్పలేదు. మునిసిపాలిటీ పరిధిలో సుమారు ఏడు వేల మంది లబ్ధిదారులు ఉండగా, ఐదు వేల మందికి ప్రభుత్వం బ్యాంకుల్లో నగదు జమ చేసింది. మరో 1,958 మంది ఇళ్లకు వెళ్లి పింఛన్ అందిస్తారు.

కాగా బ్యాంకు ఖాతాలో జమ చేసిన పింఛన్ డబ్బుల కోసం వృద్ధులు, వితంతువులు ఖాతా పుస్తకాలు, ఆధార్ కార్డులు పట్టుకొని శనివారం ఉదయం 10 గంటల నుంచి బ్యాంకుల వద్ద క్యూ కట్టారు. దూర ప్రాంతాల నుంచి కొందరు వేకువజామునే వచ్చారు. దీంతో బ్యాంకులన్నీ పెన్షన్ లబ్ధిదారులతో కిటకిటలాడాయి. విత్‌డ్రా ఫారం రాయడం రాక మరొకరి మీద ఆధార పడాల్సి వచ్చింది. తరువాత గంటల తరబడి క్యూలో ఉన్నారు. రోలుగుంట మండలం జేపీ అగ్రహారం గ్రామానికి చెందిన రొంగలి నూకరాజు పెన్షన్ డబ్బుల కోసం గంటల తరబడి క్యూలో ఉన్నాడు. వ్యవసాయ రుణం వడ్డీకి పెన్షన్ సొమ్ము జమ అయిపోయిందని బ్యాంకు అధికారులు చెప్పడంతో ఉసూరుమంటూ ఇంటికి వెనుతిరిగాడు.

క్రైం... crime news

గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

అనకాపల్లి టౌన్, జూన్ 1: స్థానిక నరసింగరావుపేటలోని టెలిఫోన్ ఎక్ఛ్సేంజ్‌కు వెళ్లే రోడ్డులో శనివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించామని పట్టణ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు తెలిపారు. మృతుడు రెడ్ కలర్ నెక్ బనియన్, బ్లాక్ కలర్ ఫ్యాంట్ ధరించి ఉన్నాడని, సుమారు 35 ఏళ్ల వయసు ఉంటుందని తెలిపారు. అయితే అతని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదని, క్లూస్ బృందం కూడా తనిఖీ చేసిందన్నారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయంలోని మార్చ్యురీకి తరలించామన్నారు. ఎవరైనా గుర్తిస్తే పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమాచారమందివ్వాలని ఆయన కోరారు.

నర్సీపట్నంలో గిరిజన మహిళ మృతదేహం

నర్సీపట్నం, జూన్ 1: పట్టణంలో ఓ మహిళ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం- చింతపల్లి రోడ్డులో మూత పడిన కల్పనా థియేటర్ సమీపంలో శనివారం ఉదయం ఒంటిపై దుస్తులు లేకుండా ఉన్న మహిళ మృతదేహం కనిపించడంతో స్థానికులు పట్టణ పోలీసులకు తెలియజేశారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు సిబ్బందితో అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. వెంటనే ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం గొప్పులపాలెం గ్రామానికి చెందిన జగ్గందొర లక్ష్మిగా గుర్తించినట్టు ఆయన చెప్పారు. చాలా కాలంగా ఈమె మతిస్థిమితం లేకుండా తిరుగుతుండడంతో కుటుంబ సభ్యులు వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. పది రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చినట్టు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ వివరించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామన్నారు.

లారీ బోల్తా : డ్రైవర్‌కు స్వల్ప గాయాలు


హైవే పక్కన బోల్తా పడిన లారీ

ఎలమంచిలి, జూన్ 1 : పట్టణంలోని పెదపల్లి జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం లారీ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాల య్యాయి. అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న లారీ ఎదుటి వాహనాన్ని తప్పించే క్రమంలో హైవే పక్కన బోల్తా పడింది. ఈ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. స్వల్ప గాయాలైన డ్రైవర్ విజయనగరం ప్రాంతానికి చెందిన వారని, అనకాపల్లి ఆస్పత్రికి వెళ్లినట్టు తెలిసింది. ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.

వంగలిలో పిడుగు పడి రెండు పశువుల పాకలు దగ్ధం

» చూడి ఆవుకు తీవ్ర గాయాలు

సబ్బవరం, జూన్ 1 : మండలంలోని వంగలి గ్రామంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు ధాటికి పిడుగులు పడి రెండు పశువుల పాకలు దగ్ధమ య్యాయి. పాకలో ఉన్న చూడి ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. మరో మూడు ఆవులు కన్నెలు తెంపుకొని పరుగులు తీశాయి. వివరాలిలా ఉన్నాయి. వంగలి గ్రామంలో కంద కనకరాజు, కంద సింహాచలం అన్నదమ్ములు ఉన్నారు. వీరి పశువుల పాకలు పక్క పక్కనే ఉన్నాయి. కనకరాజుకు ఉన్న నాలుగు పాడి పశువులను శుక్రవారం రాత్రి పది గంటలకు పాకలో కట్టేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఉదయం 6 గంటలకు కల్లం వద్దకు వచ్చేసరికి రెండు పాకలు దగ్ధమై ఉన్నాయి. కనక రాజు పాకలో ఒక ఆవు మంటలకు తీవ్రంగా గాయపడి ఉంది. పిడుగుపాటుకు పాకలు దగ్ధమ య్యాయని గ్రహించి, పశు వైద్యులకు సమాచారం అందించాడు. పశువైద్యులు వచ్చి సేవలు అందించారు. చూడి ఆవు పరిస్థితి విషమంగా ఉందని చెప్పారని బాధితుడు కనకరాజు తెలిపాడు. పాకలు దగ్గమవుతు న్నప్పుడు మూడు పశువులు కన్నెలు తెంపుకొని బయటకు పరిగెత్తాయని తెలిపాడు. నష్టం రూ2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రశాంత కౌంటింగ్‌కు సహకరించాలి : ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ

అనకాపల్లి రూరల్, జూన్ 1 : ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా సాగేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ శనివారం రాత్రి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలో ఆరు అసెంబ్లీ సెగ్మెంట్లు, ఒక ఎం స్థానానికి శంకరంలోని జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఓట్లు లెక్కిస్తారన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్దకు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు మినహా ఇతరులు రావడానికి అనుమతి లేదన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. కౌంటింగ్‌కు వచ్చేవారు మొబైల్స్, ఇతర ఎలక్ట్రికల్ పరికరాలు, అగ్గిపెట్టెలు, సిగరెట్లు, పెన్, పేపరు ఎట్టి పరిస్థితుల్లో తీసుకు రాకూడదన్నారు. ఏజెంట్లు ఒకసారి కౌంటింగ్ కేంద్రం లోపలకు వెళ్లిన తరువాత పూర్తయ్యే వరకు బయటకు వెళ్లడానికి వీల్లేదని, ఏదైనా అనారోగ్య సమస్యలుంటే ముందుగా వాటికి సంబంధించిన మందులను తమ వెంట తీసుకు రావాలని సూచించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత విజయోత్సవ ర్యాలీలు, బాణసంచా కాల్చేందుకు అనుమతి లేదన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఊహా జనిత వార్తలను నమ్మి ఎట్టి పరిస్థితుల్లోను వాటికి స్పందించరాదన్నారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే ప్రకటనలు, పోస్టులు పెట్టి గొడవలకు కారణమైతే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎవరైనా ఘర్షణలకు పాల్పడితే వారిని సీసీ టీవీ కెమెరాలు, డ్రోన్, బాడివార్న్ కెమెరాలు, వీడియోగ్రఫీ ద్వారా గుర్తించి అటువంటి వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేస్తామన్నారు. అలాగే రౌడీషీటు కూడా తెరవడం జరుగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ హెచ్చరించారు. జిల్లాలోని 104 సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీస్ పికెట్‌లు, పెట్రోలింగ్ పార్టీలు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ పార్టీలను, క్యూఆర్ టీమ్‌లు, స్పెషల్ పార్టీ టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. పార్టీ కార్యాలయాల వద్ద, ప్రధాన పార్టీ అభ్యర్థుల ఇళ్ల వద్ద పోలీస్ భద్రత ఏర్పాట్లు చేశామన్నారు.

కౌంటింగ్ నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

శంకరంలోని ఫ్యూచర్ వరల్డ్ పాఠశాలలో లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పలుచోట్ల ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం జరుగుతుందని ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. దీనిని గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆయన సూచించారు. నేషనల్ హైవే -16 మీదుగా గాని, సుంకరమెట్ట కూడలి మీదుగాని, బొజ్జన్నకొండ రోడ్డు వైపు నుంచి గాని కౌంటింగ్ కేంద్రానికి చేరుకునే వారు రేబాక అండర్ పాస్ నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్ ఆర్చ్ నుంచి చేరుకోవాలన్నారు. ఈ రూట్‌లలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు, మీడియా మిత్రులకు అనుమతి ఉంటుందన్నారు. కౌంటింగ్ అధికారులు, సిబ్బంది రేబాక అండర్ పాస్ నుంచి గోపాలపురం రోడ్డు మీదుగా భట్లపూడి గ్రామం వద్ద దగ్గర వాహనాలను పార్కింగ్ చేసుకుని కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. కలెక్టరేట్ మెయిన్‌గేటుకు ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఎలక్షన్ కమిషన్ అనుమతించిన మీడియా వారికి చెందిన వాహనాలకు మాత్రమే అనుమతించబడతాయన్నారు. కలెక్టరేట్ పక్కనున్న ఖాళీ స్థలంలో కౌంటింగ్ ఏజెంట్ల వాహనాలను పార్కింగ్ చేసుకోవాలన్నారు. కౌంటింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్ల నలుమూలల రెడ్‌జోన్‌గా ప్రకటించామని, ఎవరూ డ్రోన్‌లను ఎగర వేయరాదన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	125.00
లైవ్ ధర	145.00
విత్ స్కిన్	260.00
స్కిన్ లెస్	270.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	500
విజయనగరం	504
శ్రీకాకుళం	504

భూచోళ్లు



» అంతా కలిసి పేదల నోట్లో మట్టి కొట్టారు » డి.పట్టా భూములు చేజిక్కించుకునేందుకు » ఏడాది నుంచి వ్యూహం

» తొలుత విశాఖ శివారుల్లో గల నాలుగు మండలాల్లో 2,000 ఎకరాల వరకూ ఉన్నట్టు గుర్తింపు

» ఆ తరువాత రైతులకు ఎకరాకు రూ.5 లక్షల అడ్వాన్స్ ఇచ్చి ఒప్పందాలు » తతంగం పూర్తయిన తరువాతే 'ఫ్రీ హోల్డ్' జీవో

» ఆనందపురం రామవరంలో 20 నుంచి 25 ఎకరాలు ప్రభుత్వ పెద్దల బినామీలకు రిజిస్ట్రేషన్

విశాఖపట్నం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగర శివారు, భోగాపురం ఎయిర్‌పోర్టు పరిసరాల్లో భూములు కొనుగోలు విషయంలో అత్యున్నత అధికారి తొలి నుంచి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. విశాఖ చుట్టుపక్కల డి.పట్టా భూములు ఎక్కడెక్కడ ఉన్నాయో సమాచారం సేకరించిన సదరు కీలక అధికారి తన మనుషులను గత ఏడాది దసరా పండుగ నుంచే రంగంలోకి దింపారు. ఈ నేపథ్యంలో కీలక అధికారి బినామీ త్రిలోక్ నగర శివారుల్లోని రామవరం, గండిగుండం, మామిడిలోవ మరికొన్ని గ్రామాల్లో రైతులను కలుసుకుని బేరాలు కుదుర్చుకున్నారు. స్థానిక అధికారులు, వైసీపీ నేతల సాయంతో ఒప్పందాలు చేసుకున్నారు.

జిల్లాలోని గ్రామీణ మండలాల్లో నాలుగేళ్లక్రితం జగనన్న కాలనీలకు భారీగా పట్టా భూములను సమీకరించారు. ఇంకా జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ల కోసం మరికొంత సేకరించగా నాలుగు మండలాల్లో సుమారు రెండు వేల ఎకరాలు మాత్రమే రైతుల వద్ద డి.పట్టా భూమి ఉందని అంచనాకు వచ్చారు. రైతుల వద్ద ఉన్న భూముల వివరాలను జిల్లా యంత్రాంగం ద్వారా కీలక ఉన్నతాధికారి తీసుకుని తన బినామీ త్రిలోక్‌ను రంగంలోకి దింపారు. ఆయన ఆనందపురం మండలం గండిగుండం, రామవరం, మామిడిలోవ, గిడిజాల, బాకూరిపాలెం, శొంఠ్యాం గ్రామాల్లో రైతులను కలిసి ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇచ్చి ఒప్పందాలు చేసుకున్నారు.

ప్రభుత్వ పెద్దలు డి.పట్టా భూములు కొనుగోలుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్న తరువాత ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 27న సెక్షన్ 35/2023 పేరిట గజిట్ విడుదల చేసింది. ఆ తరువాత సుమారు రెండు నెలలకు అంటే గత డిసెంబరు 19న జీవో 596 జారీచేసింది. దీని ప్రకారం ప్రభుత్వం ఇచ్చిన డీపట్టా భూములపై సంబంధిత రైతులకు సర్వహక్కులు కల్పించేలా ఫ్రీ హోల్డ్ అనుమతులు ఇచ్చే అధికారం సంబంధిత జిల్లా కలెక్టర్లకు కల్పించింది. ఆ జీవో మేరకు జిల్లాలో డీపట్టా భూములు రైతుల వద్దే ఉన్నాయా?, లేవా?...అనేది వీఆర్వోలు సర్వే చేసి తహసీల్దార్లకు నివేదికలు అందజేస్తారు.

ప్రభుత్వ పెద్దలు ఒప్పందాలు కుదుర్చుకున్న భూములకు సంబంధించి ఆనందపురం మండల తహసీల్దార్ కార్యాలయం నుంచి వెళ్లిన ప్రతిపాదనలకు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ ఆమోదం తెలిపిన తరువాత ఫ్రీ హోల్డ్ అనుమతులు వచ్చాయి. విచిత్రమేమిటంటే...గత ఏడాది అక్టోబరు 27న ప్రభుత్వం గజిట్ జారీచేసిన నెల రోజుల వ్యవధిలోనే అంటే నవంబరు 27న పలు గ్రామాల్లో డీపట్టా భూములను ఫ్రీ హోల్డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సాధారణంగా భూముల వ్యవహారంలో నెలలు, సంవత్సరాలు అధికారుల చుట్టూ తిరిగితే తప్ప అనుమతి దొరకదు. అటువంటిది కేవలం నెల రోజుల్లోనే క్షేత్ర స్థాయిలో సర్వే చేసి తహసీల్దారు..అక్కడ నుంచి ఆర్డీవో, అక్కడ నుంచి జేసీ...చివరిగా కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేసింది. ఈ విధంగా కొలవానిపాలెం, రామవరం, చందక, పెకూరు, గొట్టిపల్లి, బాకూరుపాలెం, గిడిజాల, శొంఠ్యాం, గండిగుండం, మామిడిలోవ గ్రామాల్లో భారీఎత్తున డీ పట్టా భూములను ఫ్రీహోల్డ్ చేశారు. ఈ ప్రక్రియ జరిగిన సుమారు 20 రోజుల తరువాత డిసెంబరు 19న జీవో నంబరు 596 వచ్చింది. అప్పటికే పలు గ్రామాల్లో రైతులతో ఒప్పందాలు కుదుర్చుకున్న త్రిలోక్ అండ్ గ్యాంగ్ నెమ్మదిగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. రామవరంలో గత ఏడాది కుదుర్చుకున్న ఒప్పందాలు మేరకు ఇప్పటివరకూ సుమారు 20 నుంచి 25 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయి. మిగిలిన భూములకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలని భావించారు. అయితే గడచిన వారం, పది రోజుల నుంచి భూముల వివాదం బయటకు రావడంతో త్రిలోక్ బ్యాచ్ పొరుగునున్న భోగాపురం మండలంపై దృష్టిసారించారన్న ఆరోపణలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం భీమిలి మండలం అన్నవరం గ్రామంలో డీపట్టా భూముల్లో ఫెన్సింగ్ వేసే ప్రక్రియ వెనుక త్రిలోక్ హస్తం ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.


గత ఏడాది నవంబరులో ఫ్రీహోల్డ్‌చేసిన రామవరం భూములు

వేకువజామున కుండపోత

» వాతావరణంలో మార్పుల కారణంగా పలుచోట్ల భారీ వర్షం
» చెరువులా మారిన గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్ ఆవరణ
» రోలుగుంట ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో విరిగిపడిన చెట్లు
» అంతటా చల్లబడడంతో ఉపశమనం పొందిన జనం


చెరువును తలపిస్తున్న కృష్ణాదేవిపేట బస్‌స్టేషన్ ఆవరణ


రోలుగుంట ఎంపీడీవో కార్యాలయంలో నేలకూలిన కొబ్బరిచెట్టు

కృష్ణాదేవిపేట, జూన్ 1 : వాతావరణంలో మార్పుల కారణంగా గొలుగొండ మండలంలో శనివారం వేకువజామున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. పల్లె రహదారులు మరింత ఛిద్రంగా మారాయి. ముఖ్యంగా కృష్ణాదేవిపేట ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణ వర్షపు నీటితో చెరువును తలపించింది. కొన్ని గ్రామాల్లో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో మురుగు రోడ్లపై ప్రవహించింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో గత వారం రోజులుగా ఎండలతో అల్లాడుతున్న జనం ఉపశమనం పొందారు. ఈ వర్షం ఖరీఫ్ సాగుకు ఎంతగానో దోహదపడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంట : మండలంలో శనివారం తెల్లవారుజాము మూడున్నర గంటల ప్రాంతంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులకు ఈదురు గాలులు తోడుకావడంతో పలు గ్రామాల్లో చెట్లు పడిపోయాయి. రోలుగుంటలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కొబ్బరి చెట్లు నేలకూలాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పినట్లైంది. శుక్రవారం సాయంత్రం ఈ ఆవరణలో ఉన్న ఎంపీడీవో, ఎంఈవో, హౌసింగ్, ఉపాధి హామీ, వెలుగు, కార్యాలయాల సిబ్బంది విధులు ముగించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి చెట్లు పడిపోయి ఉండడంతో ఒక్కసారిగా ఉక్కిలిక్కిపడ్డారు. తెల్లవారుజామున ఈ ఘటన జరిగిందని, అదే పగటి పూట జరిగి ఉంటే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందారు.

బుచ్చెయ్యపేట : మండలంలో శనివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో వాతావరణ ఒక్కసారిగా చల్లబడింది. దీంతో వేసవి తాపంతో అల్లాడుతున్న ప్రజలు ఉపశమనం పొందారు. గత వారం రోజులుగా భానుడి ఉగ్రరూపంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఈ దశలో కురిసిన వర్షం అందరిలో ఆనందాన్ని నింపిందని చెప్పవచ్చు.

మాడుగుల : ఉరుములు, మెరుపులతో శుక్రవారం రాత్రి మండలంలో భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాల్లో ఎటుచూసినా నీరే కనిపించింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కాగా, ఇన్నాళ్లూ ఉష్ణతాపంతో అల్లాడుతున్న జనం వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేశారు.

రావికమతం : తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజానీకం శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి సేదతీరారు. రోహిణి కార్తె కావడంతో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరిగిపోయాయి. దీంతో అంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ తరుణంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షంతో అంతటా కాస్త చల్లబడింది.

300 కిలోల జాంగ్రీతో ఆంజనేయ ఆలయంలో పూజలు


విశేష అలంకరణలో స్వామి

చోడవరం, జూన్ 1 : హనుమాన్ జయంతిని శనివారం మండలంలోని పలు గ్రామాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చోడవరం పట్టణంలోని వ్యాపార వీధిలో గల అభయాంజనేయ ఆలయంలో అర్చకులు కె.ప్రసాదశర్మ, కె.విక్రమ్‌శర్మల ఆధ్వర్యంలో మూడు వందల కిలోల జాంగ్రీ స్వీటుతో స్వామికి పూజలు చేశారు. అంతకుముందు స్వామివారిని విశేషంగా అలంకరించారు. అలాగే, అంకుపాలెం గోవాడ, అంబేరుపురం, గజపతినగరం, లక్కవరం తదితర గ్రామాల్లో పెద్దఎత్తున పూజా కార్యక్రమాలు జరిగాయి. అంకుపాలెంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, స్థానిక నాయకులు చందురాంబాబు తదితరులు పాల్గొన్నారు.


జాంగ్రీ స్వీటును స్వామికి నైవేద్యంగా సమర్పిస్తున్న అర్చకులు

కబ్రిస్థాన్ స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

» తహసీల్దార్ కార్యాలయ అధికారికి వివరించిన మత పెద్దలు


సీనియర్ అసిస్టెంట్‌కు వినతి అందిస్తున్న షేక్ రహీంబీబి తదితరులు

సబ్బవరం, జూన్ 1: మండల కేంద్రంలోని సర్వే నంబరు 258లో కబ్రిస్థాన్ (శ్మశానవాటిక)కు కేటాయించిన ప్రభుత్వ భూమి 50 సెంట్లను స్థానికులు ఆక్రమించుకున్నారని షేక్ రహీంబీబీ, గ్రామ మజీద్ కమిటీ సభ్యులు శనివారం తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాసులమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బవరంలో 80 ముస్లిం కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. తమకు కబ్రిస్థాన్ (శ్మశాన వాటిక) లేదని పలు మార్లు రెవెన్యూ అధికారులకు, కలెక్టర్ వినతులు ఇవ్వగా. 2015లో సర్వే నంబరు 258లో 50 సెంట్లు భూమిని కేటాయించి, తమకు అప్పగించార న్నారు. అప్పటి నుంచి కబ్రిస్థాన్ తమ ఆధీనంలో ఉందన్నారు. తాము 2022లో ప్రహరీ నిర్మాణం చేపడుతుండగా పోలీసులు వచ్చి కోర్టులో కేసు ఉందని పనులు నిలిపేశారన్నారు. తాము ప్రస్తుతం హైకోర్టులో కబ్రిస్థాన్ స్థలం కోసం పోరాటం చేస్తున్నామన్నారు. అయితే ఇటీవల సబ్బవరానికి చెందిన కొందరు ఆ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్ని స్తునారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో షేక్ కరీమ్, షేక్ చెల్లాసాహీన్, షేక్ బాబ్జీ తదితరులు ఉన్నారు.

కూటమి గెలుపు ఖాయం

» దుర్గమ్మను దర్శించుకున్న అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్

విజయవాడ, జూన్ 1 : ఎన్నికలలో ఖచ్చితంగా కూటమి గెలుస్తుందని అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ అన్నారు. శనివారం ఆయన కుటుంబసమేతంగా ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సందర్భంగా అనకాపల్లి వెళుతూ అమ్మవారి దర్శనానికి కుటుంబసమేతంగా విచ్చేసినట్లు చెప్పారు. ఖచ్చితంగా ఎన్నికలలో కూటమి గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జగన్మోహనరెడ్డి 175 స్థానాలు తనకే అంటున్నాడని ముందు ఒకటో నెంబర్ కానీ ఆఖరి ఐదో నెంబర్ కానీ ఖచ్చితంగా ఎగిరి పోతాయన్నారు. విజయంతో తిరిగి తాను దుర్గమ్మను దర్శించుకోవడానికి వస్తానని తెలిపారు. ఆయన వెంట పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

ఆర్ఈసీఎస్ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్‌పై కోర్టు ధిక్కారణ పిటిషన్

» కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఉమాశంకర్


హైకోర్టు తీర్పు పత్రాలను చూపుతున్న ఉమాశంకర్

కశింకోట, జూన్ 1 : స్థానిక ఆర్ఈసీఎస్ ఎండీ, రాజీవ్‌గాంధీ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాండెంట్ ఎం.శ్యామలపై కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేసినట్టు కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. ఉమాశంకర్ తెలిపారు. శనివారం ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. తనపై ఆర్థిక ఆరోపణలు చేసి, వారికున్న పలుకుబడితో జనరల్ బాడీ సమావేశంలో చర్చ జరపకుండా 2021 ఏప్రిల్ 19న సస్పెండ్ చేశారన్నారు. అనంతరం విచారణ సమయంలో సంబంధిత అధికారులను క్రాస్ ఎగ్జిమినేషన్ చేసే అవకాశం, న్యాయవాది సేవలు ఉపయోగించుకునే అవకాశం కూడా ఇవ్వకుండా ఉద్యోగం నుంచి తొలగిస్తూ 2022 జూన్ 6న ఉత్తర్వులు జారీ చేశారన్నారు. దీనిపై తాను హైకోర్టును ఆశ్రయించగా 2024 ఫిబ్రవరి 27న ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసిందని చెప్పారు. ఈ విషయాన్ని ఈ ఏడాది మార్చి 1న ప్రస్తుత ఎండీ శ్యామలకు కోర్టు ఆదేశాలు, వినతిపత్రాన్ని ఇచ్చానన్నారు. అలాగే ఏప్రిల్ 2న సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ కూడా ఆదేశాలు జారీ చేశారన్నారు. అయితే నేటి వరకు తనను విధుల్లోకి తీసుకోని కారణంగా శ్యామలపై కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను హైకోర్టులో దాఖలు చేసినట్టు డాక్టర్ బి.ఉమాశంకర్ వెల్లడించారు.

జవహర్‌రెడ్డి భూదందాపై విచారణ చేపట్టాలి

» మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్


సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

తుమ్మపాల, జూన్ 1: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, అతని కుమారుడు, అనుచరులు కలిసి భోగాపురం ప్రాంతంలో 800 ఎకరాల భూదందాపై సమగ్ర విచారణకు సిట్ వేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం టీడీపీ పార్లమెంట్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ జీవో 596ను అడ్డం పెట్టుకుని డి.పట్టా భూములకు ఫ్రీ ఓల్డ్ అనుమతి తీసుకుని బినామీల పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. విశాఖ జిల్లా కలెక్టర్, ఉత్తరాంధ్ర మంత్రులు ఈ అంశంపై నోరు మెదపకపోవడం దారుణమన్నారు. బిల్లు ఏపీ పేరుతో 6,116 ఎకరాల భూమిని దళితుల నుంచి అధికార పార్టీ నాయకులు లాక్కొన్నారని ఆరోపించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వేలాది ఎకరాల భూములు కబ్జాకు గురయ్యాయని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

సజావుగా పాలీసెట్ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

అనకాపల్లి రూరల్, జూన్ 1 : మండలంలోని రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఆరో రోజు పాలీసెట్ కౌన్సెలింగ్ సజావుగా సాగింది. కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ చేపట్టారు. 75,001 నుంచి 92 వేల ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ జరిపారు. 149 మంది విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఐసీఆర్ పత్రాలను అందజేశారు. ఇందులో 47 మంది బాలురు ఉండగా 102 మంది బాలికలు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారన్నారు. ఆదివారం 92,001 నుంచి 1,08,000 ర్యాంక్ వరకు కౌన్సెలింగ్ ఉంటుందని ఆయన తెలిపారు.

శ్రీరామదూతం శిరసా నమామి

వాడవాడలా ఘనంగా హనుమాన్ జయంతి



ఎలమంచిలి రామ్‌నగర్ టిడ్కో సముదాయం వద్ద పూజలందుకున్న భారీ ఆంజనేయ స్వామి

అనకాపల్లి టౌన్, జూన్ 1: జిల్లాలో హనుమాన్ జయంతి ని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీదేవిపేటలోని అభయాంజనేయ స్వామిని నిర్వాహకులు రుద్రాక్షలతో అలంకరించారు. కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, పీలా తులసీరామ్, జగ్గారావు పాల్గొన్నారు. అలాగే గవరపాలెం పరమేశ్వరి పార్కు జంక్షన్‌లోని అభయాంజనేయస్వామిని పూలతో అలంకరించారు. రింగురోడ్డులోని ఆంజనేయస్వామిని జీడిపప్పు, బాదంపప్పు, కిస్‌మిస్ వంటి డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. పెదరామస్వామి ఆలయం వద్ద పంచముఖ ఆంజనేయస్వామికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ పూజలు నిర్వహించారు. అలాగే తోటాడ జంక్షన్, కొణతాల సుబ్రహ్మణ్యం వీధి, వన్ వే డౌన్, మల్లిమ ఋగులవారివీధి, గాంధీనగరం అంజయ్యకాలనీ తదితర ప్రాంతాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో పూజలు చేశారు. అన్ని చోట్ల అన్నసమారాధనలు నిర్వహించారు. అలాగే పరమేశ్వరిపార్కు జంక్షన్‌లోని ఆంజనేయస్వామిని టీడీపీ బీసీ సాధికార సమితి కన్వీనర్ మళ్ల సురేంద్ర, పొలిమేర నాయుడు, వేగి కృష్ణ దర్శించుకున్నారు. చేపలబజారు వద్ద రామాలయంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పూజలు చేశారు.

కొత్తూరు/కశింకోటలో.. అనకాపల్లి, కశింకోట మండలాల్లో పలు గ్రామాల్లో ఆంజనేయస్వామి జయంతి వేడుకలు శనివారం అత్యంత వైభవంగా జరిగాయి. కొత్తూరు పంచాయతీ ముత్రాసు కాలనీ ఆంజనేయస్వామి ఆలయంలో కూటమి కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోన శ్రీను ఆలయానికి బీరువా బహూకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, నూకరాజు, బర్ల నాగరాజు, కొంకిపూడి అజయ్, నాగులాపల్లి సత్తిబాబు పాల్గొన్నారు. అలాగే సత్యనారాయణపురం, మూలపేట, కుంచంగి ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, బాబూరావు పాల్గొన్నారు.

ఉగ్గినపాలెంలో ఆంజనేయ స్వామిని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బుద్ద నాగజగదీశ్వరరావు, దాడి రత్నాకర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ప్రారంభించారు. కశింకోట సలాదివీధి ఆంజనేయస్వామి ఆలయంలో రత్నాకర్ పూజలు చేశారు. చింతలపాలెంలో జనసేన మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న ఆధ్వర్యంలో అభయాంజనేయస్వామి జయంతిని జరుపుకున్నారు. అన్నసమారాధనను తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు ప్రారంభించారు.

తుమ్మపాలలో.. తుమ్మపాల, మార్టూరు, కొండుపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ధూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పరవాడలో.. పరవాడ సినిమాహాల్ జంక్షన్ వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచి అభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మీ శ్రీనివాస్ దంపతులు, సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, స్థానిక నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, బొద్దపు అయ్యబాబు దర్శించుకుని పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధనను ఏర్పాటు చేశారు. సాయంత్రం ఆంజనేయస్వామి ప్రతిమ మేళతాళాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. అలాగే భరిణికం, పి. బోనంగి, కలపాక, పెదముషిడివాడ, తానాం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.



ఉగ్గినపాలెం ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న బుద్ద నాగజగదీశ్వరరావు

పాయకరావుపేట/రూరల్‌లో.. పట్టణంలోని లింగాలతోట కాలనీలో ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. జనసేన నాయకులు గెడ్డం బుజ్జి, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, తదితరులు ఆంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. మండలంలోని సత్యవరం, మంగవరం, పెంటకోట, కుమారపురం, కేశవరం, మాసాహెబ్‌పేట, పెదరాంభద్రపురం, పాల్తేరు, గుంటపల్లి గ్రామాలలో ఆంజనేయస్వామి ఆలయాలలో భక్తులు పూజలు నిర్వహించారు. మహిళలు హనుమాన్ చాలీసా పఠనం చేశారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

ఎస్.రాయవరంలో.. మండలంలోని ఎస్.రాయవరం, వమ్మవరం, అడ్డరోడ్డు తిమ్మాపురం గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. దార్లపూడి అభయాంజనేయ స్వామి వారి ఆలయంలో పంచామృత అభిషేకం చేశారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పెదకలవలాపల్లిలో భక్తులు ఆంజనేయ స్వామివారిని దర్శించి, పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. నిర్వాహకులు ఆంజనేయ స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపి, స్వామివారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.

ఎలమంచిలిలో.. ఎలమంచిలి పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతిని భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారు నుంచే భక్తులు ఆంజనేయ స్వామి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని చారిత్రాత్మక ఆంజనేయ స్వామి ఆలయం, రామ్‌నగర్ టిడ్కో గృహ సముదాయం వద్ద, ద్వారకానగర్, పెదపల్లి, కొక్కిరాపల్లి, ప్రాంతాలు, ఏటికొప్పాక, పులపర్తి, పిఎస్ఆర్‌పేట, పురుషోత్తపురం గ్రామాల్లో హనుమాన్ జయంతిని భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఎలమంచిలి పడమట గెడ్డ వద్ద పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో 101 తమలపాకు పూజలు, సింధూరం కుంకుమార్చన పూజలను ఆలయ ధర్మకర్త ఆడారి ఆదిమూర్తి నిర్వహించారు.



అనకాపల్లి టౌన్: లక్ష్మీదేవిపేటలో రుద్రాక్షల అలంకరణలో ఆంజనేయస్వామికి పూజలు చేసిన భక్తులు

సబ్బవరంలో.. మండ లంలోని సబ్బవరం, జోడుగుళ్ళ, మొగలిపురం, యాతపాలెం, ఆరిపాక రావలమ్మపాలెం తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయాల్లో భక్తులు ఆంజనేయస్వామిని పంచామృతాలతో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిగాయి. రావలమ్మపాలెంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యురాలు చొక్కాకుల లక్ష్మి, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్‌టీ రామకాసు, సర్పంచ్ ఎస్. నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో.. మండలంలోని పలుచోట్ల శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.. నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆనుకుని వున్న ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేశారు. కార్యాలయాన్ని సీఐ విజయ్‌కుమార్, పలు పార్టీల నాయకులు వీసం రామకృష్ణ, కొప్పిశెట్టి వెంకటేశ్, కోసూరి శ్రీను, వీసం రాజు, తదితరులు స్వామిని దర్శించుకున్నారు. ఉపమాక క్షేత్రంలో కొండపైకి వెళ్లే దారిలో వున్న రామాలయంలో హనుమ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ప్రసాదాచార్యులు, శేషాచార్యులు, కృష్ణమాచార్యులు నేతృత్వంలో హనుమాన్ చాలీసా పారాయణం జరిగాయి.



కశింకోటలో రత్నాకర్ సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు



నక్కపల్లి ఆంజనేయస్వామి ఆలయం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం



పాయకరావుపేట: సత్యవరంలో ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



పరవాడ: సినిమాహాల్ జంక్షన్‌లో ఆంజనేయస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హైకోర్టు ఆదేశాలను పట్టించుకోని అధికారులు

» యథేచ్ఛగా అక్రమ నిర్మాణం.. » వృద్ధ బాధితురాలి ఆవేదన

అచ్యుతాపురం రూరల్, జూన్ 1 : కమర్షియల్ భవన నిర్మాణం విషయమై హైకోర్టు ఆదేశాలు జారీ చేసినా ఏ అధికారి చర్యలు తీసుకోకపోవడంతో స్థల యజమాని నిర్మాణం సాగిస్తున్నాడని మోసయ్యపేటకు చెందిన వృద్ధ మహిళ కాండ్రేగుల మహలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. అచ్యుతాపురం జంక్షన్‌కు 100 మీటర్ల దూరంలో తమ ఇళ్లు, షాపులను ఆనుకుని గత నెల నవంబరు నెలలో మళ్ల నవీన్ అనే వ్యక్తి కట్టడం ప్రారంభించాడు. 84/6 సర్వే నంబరులో తమ భూమి ఉండగా, నవీన్ భూమి 84/7లో ఉంది. నవీన్ భారీ కమర్షియల్ కట్టడానికి స్థలం సరిపోకపోవడంతో తమ భూమిని ఆక్రమించి నిర్మాణం చేపట్టారన్నారు. సెల్లార్‌తో కూడిన కమర్షియల్ భవనం నిర్మించాలంటే వీఎండీఆర్‌ఏ అనుమతులు తీసుకోవాలన్నారు. అందుకు విరుద్ధంగా వీఎండీఆర్‌ఏ నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా సెల్లార్ నిర్మాణానికి భారీ గోతులు తీసి కట్టడానికి ప్రయత్నించే సమయంలో అడ్డుకున్న తమపై ఏప్రిల్ 4న దాడికి పాల్పడ్డారన్నారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు కూడా నమోదు చేశారన్నారు. అక్రమ కట్టడంపై అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో తాను హైకోర్టును ఆశ్రయించామన్నారు. మే 10న అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోమని హైకోర్టు అధికారులను ఆదేశించిందన్నారు. అమరావతి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీకి, జిల్లా కలెక్టర్‌కు, విశాఖపట్నం వీఎంఆర్‌డీఏకు, స్థానిక పంచాయతీ సెక్రటరీకి, అక్రమ కట్టడం చేస్తున్న మళ్ల నవీన్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందన్నారు. రెండు రోజుల నుంచి తిరిగి అక్రమ కట్టడం నిర్మాణాన్ని చేస్తున్నారన్నారు. న్యాయం చేయాలంటూ కాళ్లరిగేలా అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోవడం లేదని, అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు ఆదేశాలపై చర్యలు తీసుకోకపోవడంపై తాము తిరిగి కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను వేయనున్నట్టు ఆమె తెలిపారు. ఇదే విషయమై శనివారం ఈవోపీఆర్‌డీకి ఫిర్యాదు చేశామన్నారు.

ఏటికొప్పాక నుంచి కౌంటింగ్ ప్రారంభం

18 రౌండ్లు.. 14 టేబుళ్లు ఏర్పాటు

ఒక్కో రౌండ్‌లో 14 బూత్‌ల ఓట్ల లెక్కింపు

ఎలమంచిలి, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఏటికొప్పాక నుంచి కౌంటింగ్ ప్రారంభమై అచ్యుతాపురం మండలం తంతడి పోలింగ్ బూత్‌తో ముగుస్తుంది. నియోజకవర్గంలో 2019 ఎన్నికల కంటే అధికంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి శంకరంలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో ఓట్లు లెక్కింపు మంగళవారం ప్రారంభమవుతుంది. నియోజకవర్గంలో 246 పోలింగ్ కేంద్రాలుండగా.. ఎలమంచిలి మునిసిపాలిటీ, మండలం, రాంబిల్లి, మునగపాక, అచ్యుతాపురం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 2,06,394 ఉండగా, వీరిలో 1,77,374 (85.94 శాతం) మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉండగా పోస్టల్ బ్యాలెట్‌లు 1,920, సర్వీస్ ఓట్లు (శనివారం నాటికి) 376 ఓట్లు అందాయి. కౌంటింగ్ ప్రారంభం రోజున ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. అనంతరం ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఒక్కో రౌండ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. ప్రతి రౌండ్‌కు 14 బూత్‌ల ఓట్ల లెక్కింపు జరగనుంది. 18 రౌండ్‌లలో లెక్కింపు సాగుతుంది. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు 3 టేబుళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ముందుగా ఎలమంచిలి మండలం ఏటికొప్పాక పోలింగ్ బూత్ నుంచి ప్రారంభమై, అచ్యుతాపురం మండలం తంతడి పోలింగ్ బూత్‌తో ముగుస్తుంది. ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా కౌంటింగ్ ప్రక్రియ సాగుతుంది. ఓట్ల లెక్కింపులో అనుసరించాల్సిన విధానాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు సూచనలు, సలహాలు ఇస్తున్నారని రిటర్నింగ్ అధికారి మనోరమ తెలిపారు.



పెదపల్లిలో పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పెదపల్లిలో కార్డెన్ సెర్చ్

31 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ఎలమంచిలి, జూన్ 1 : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శనివారం మునిసిపాలిటీలోని పెదపల్లిలో సర్కిల్ పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి 31 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. సీఐ ఎస్‌కే.గఫూర్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది కలిసి కార్డెన్ సెర్చ్‌లో భాగంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్టు తెలిపారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలకు అన్ని పత్రాలు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఆపరేషన్‌లో ఎస్ఐలు పాపినాయుడు, సింహాచలం, సర్కిల్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

221వ రోజుకు

పెదకలవలాపల్లి రైతుల నిరసన

రాంబిల్లి, జూన్ 1 : మండలంలోని పెదకలవలాపల్లిలో నేవీ ప్రభావిత రైతులు చేస్తున్న నిరసన కార్యక్రమం శనివారానికి 221వ రోజుకు చేరుకుంది. తమ గ్రామాన్ని ఆనుకొని ఉన్న కొండ చుట్టూ డీఆర్‌డీవో ప్రహరీ గోడ నిర్మాణం చేపడుతుండంతో అన్నివిధాల తాము ఉపాధి కోల్పోయామని, అధికారులు ఆదుకోవాలని 221 రోజుల తరబడి శాంతియుతంగా నిరసన చేస్తున్నా ఎవరూ పట్టించుకోకపోవడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు న్యాయం జరిగేంతవరకు తాము చేస్తున్న శాంతియుత పోరాటాన్ని ఆపేది లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు రావి దేముళ్లు, మహిళా రైతులు పాల్గొన్నారు.

రైతు కూలీ సంఘం మహాసభలను విజయవంతం చేయాలి

తుమ్మపాల, జూన్ 1 : రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు కోరారు. శనివారం నెహ్రూచౌక్‌లో ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 15,16,17 తేదీల్లో ఏలూరులో ఈ సభలు జరగనున్నాయన్నారు. 70 ఏళ్లగా ప్రభుత్వాలు ఎన్నిమారినా రైతులు, సాగునీటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. షుగర్, జ్యూట్ ఫ్యాక్టరీలను మూసేస్తూ రైతులకు ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కనీవ్వకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు డి. జగదీశ్వరరావు, ఎం.సతీష్, గడి సూర్యారావు, సూరిబాబు, జగ్గారావు, రమేష్, సన్యాసిరావు పాల్గొన్నారు.

కౌంటింగ్ సెంటర్‌లో అప్రమత్తంగా వుండాలి : ఆర్వో

నక్కపల్లి, జూన్ 1: పాయకరావుపేట సెగ్మెంట్‌కు సంబంధించి జూన్ 4న జరగనున్న కౌంటింగ్‌కు నియమితులైన ఉద్యోగులు అప్రమత్తంగా వుండాలని పాయకరావుపేట నియోజకవర్గ ఆర్వో కె.గీతాంజలి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, డీటీలు, ఇతర సిబ్బందికి అవగాహన కల్పించారు. పాయకరావుపేట సెగ్మెంట్ కౌంటింగ్ కేంద్రానికి సంబంధించి మీడియా సెల్, ఈవీఎంలకు నియమింపబడిన సిబ్బంది నిర్లక్ష్యంగా వుండకూడదన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు : ఎస్ఐ

మునగపాక (తుమ్మపాల), జూన్ 1 : ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మునగపాక ఎస్ఐ పి. ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం మండలంలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. రెచ్చగొట్టే విధంగా నాయకులు మాట్లాడడం, ర్యాలీలు, ఊరేగింపులు, బాణసంచా నిషేధమన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగితే బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ లా అండ్ ఆర్డర్‌కు సహకరించాలని ఆయన కోరారు.

కూరగాయల ధరలు పైపైకి..

... 5వ పేజీ తరువాయి

అవుతాయి. స్థానికంగా వంకాయలు, గోరుచిక్కుడు, బీరకాయలు కూడా రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నా అంతంత మాత్రంగానే సరకు రావడం వల్ల డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెలు, బియ్యం ధరలు ఆకాశాన్నంటగా ఇప్పుడు కూరగాయల ధరలు కూడా పెరిగాయని సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. అనకాపల్లి మార్కెట్‌కు తెల్లవారుజామున నాలుగు గంటలకే ఇతర జిల్లాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ నుంచే చోడవరం, మాడుగుల, పాడేరు, ఎలమంచిలి తదితర ప్రాంతాల చిరు వ్యాపారులు కూరగాయలను కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో అమ్మకాలకు తీసుకు వెళుతుంటారు. అయితే అనకాపల్లిలో రైతు బజారు లేకపోవడం కూడా రైతులు, కొనుగోలుదారులకు శాపంగా మారింది. రైతు బజారు ఉంటే నిర్ణీత ధర ఇటు రైతుకు, అటు కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. రైతు బజారు మంజూరై ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడంతో కూరగాయల రైతులకు కూడా పండిన పంటకు తగిన గిట్టుబాటు ధరలు కొన్ని సందర్భాల్లో రావడం లేదనే ఆవేదన ఉంది. అనకాపల్లి కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేసిన చిరువ్యాపారులు వివిధ ప్రాంతాల్లోని తమ దుకాణాల వద్ద కూడా అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలి

... 5వ పేజీ తరువాయి

విధంగా కౌటింగ్ కూడా ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ 30, అలాగే 144 సెక్షన్లు అమలులో ఉన్నందున కౌంటింగ్‌కి ముందు, తరువాత జనం గుమిగూడి ఉండకూడదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు కాల్చడం నిషేధించామన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకులను చూసుకొని రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మోహన్, పట్టణ సీఐ కాంతికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

వర్షంతో ఊరట

అనకాపల్లి టౌన్, జూన్ 1 : పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు 38 డిగ్రీల ఉష్ణోగ్రతతో అల్లాడిన ప్రజానీకానికి అర్ధరాత్రి పడిన వర్షంతో ప్రజలు ఉపశమనం పొందారు. 19.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు తెలిపారు. ఈదురుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

రాంబిల్లిలో.. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి ఉరుములు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. వర్షం కారణంగా గ్రామాల్లో రోడ్లు జలమయమయ్యాయి. ఉదయం అంతా తీవ్రంగా ఎండ కాయడంతో తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరయ్యారని, వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది.

సర్వే సర్వత్రా...

... 5వ పేజీ తరువాయి

మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో 12 స్థానాలు కూటమికి, 3 వైసీపీకి వస్తాయని పలు సంస్థలు వెల్లడించాయి. అరకులోయ, పాడేరు, మాడుగుల స్థానాలు మాత్రమే వైసీపీకి వస్తాయని, మిగిలినవన్నీ కూటమికే దక్కుతాయని విశ్లేషించాయి. జనసేన పోటీ చేసిన నాలుగు (అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం దక్షిణం, పెందుర్తి) సీట్లు గెలుచుకుంటుందని, విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుస్తారని తెలిపాలి.

'ఆరా' మస్తాన్ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తూ రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేసిన చోట ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం విశాఖ జిల్లాలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక) ఓడిపోతున్నారు. అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓడిపోతారని, కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ గెలుస్తారని వెల్లడించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు నుంచి టైట్ ఫైట్ ఎదుర్కొన్నారని విశ్లేషించారు. విశాఖపట్నం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపు ఖాయమని, ఆయనకు మెజారిటీ కూడా భారీగా వస్తుందని పలు సంస్థలు విశ్లేషించాయి.

విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలి

» డీఈవో వెంకటలక్ష్మమ్మ



కుక్‌కు ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

సబ్బవరం, జూన్ 1: విద్యార్థులకు రుచికరమైన ఆహారం వండి పెట్టాలని జిల్లా విద్యా శాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాల్లో శనివారం జిల్లాలో 22 పాఠశాలలకు చెందిన 70 మంది కుక్ కమ్ హెల్పర్లకు నిర్వహించిన వంటలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆరు రోజులు పాటు ఆరు రకాల వంటలను రుచికరంగా వండాలన్నారు. ఈ సందర్భంగా వారు తయారు చేసిన వంటలను రుచి చూశారు. రుచికరంగా వండిన స్థానిక ప్రభుత్వ హైస్కూల్ కుక్ గౌరీకి ప్రోత్సాహక బహుమతిని ఇచ్చి అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 బీఎస్ఎన్ మూర్తి, ఎంఈవో-1 లక్ష్మణరావు, జిల్లా డేటా అధికారి ఎస్. రవి, ట్రైనర్ శ్రీదేవి పాల్గొన్నారు.

రైతులకు సరిపడా విత్తనాలు అందించాలి

» రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సూర్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణ

అనకాపల్లి టౌన్, జూన్ 1 : జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సరిపడా విత్తనాలను అందించాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీజన్‌కు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు స్పందించాలని, రైతులకు సరిపడా వరి,వేరుశనగ, నువ్వులు విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రైతులకు సబ్సిడీ రూపంలో విత్తనాలు అందించేందుకు అధికారులు చొరవ చూపాలని కోరారు. రైతులకు బ్యాంకుల ద్వారా పెట్టుబడి రుణాలు అందించాలన్నారు. అవకతవకలుగా ఉన్న భూ సర్వేను రద్దు చేసి రైతుల సమక్షంలో గ్రామస్థాయి, రెవెన్యూ అధికారులు రీ సర్వే చేసి గత పాసు పుస్తకాలను అనుసరించి సవరించాలన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.అప్పలరాజు, కమిటీ సభ్యులు నాయనబాబు, నాగేశ్వరరావు, సత్యనారాయణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపురంలో వృథాగా తాగునీరు



శ్రీరాంపురంలో కొళాయి నుంచి వృథాగా పోతున్న నీరు

పాయకరావుపేట రూరల్, జూన్ 1 : మండలంలోని పలు గ్రామాలలో తాగునీటికి ఇబ్బందులు పడుతుంటే.. మరో పక్క తాగునీటిని వృథా చేస్తున్నారు. కొళాయిలకు ట్యాపులు లేక చాలా గ్రామాలలో నీరు వృథాగా పోతోంది. మండలంలోని శ్రీరాంపురం పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న కొళాయికి ట్యాపులు లేకపోవడంతో నీరు వృథాగా పోతున్నది. కొళాయి వస్తునంత సేపు నీరు వృథాగా పోతునే ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైన స్పందించి తాగునీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం, జూన్ 1: మండలంలోని సర్వసిద్ధి పీహెచ్‌సీ పరిధిలోని పేటసూదిపురంలో శనివారం మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన శిబిరంలో పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ పీఎస్‌పీఎస్ ప్రసాద్ కీటక జనిత వ్యాధులైన మలేరియా, ఫైలేరియా, మెదడు వాపు, డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించి, తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చిక్కుల్లో పడవద్దు : సీఐ

రాంబిల్లి, జూన్ 1: రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చిక్కుల్లో పడవద్దని రాంబిల్లి సీఐ లక్ష్మణరావు అన్నారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జూన్ 4న ఎన్నికల ఫలితాలు వెలువడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ర్యాలీలు, ఊరేగింపులకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. బాణసంచా విక్రయాలపై కూడా నిషేధం విధించామన్నారు. ఎన్నికల ఫలితాల సమయంలో ప్రజలంతా సమన్వయం పాటించాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతల విషయంలో అందరూ పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు.

లెక్కింపు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

» ఎలమంచిలి రిటర్నింగ్ అధికారి మనోరమ



సమావేశంలో సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి మనోరమ

ఎలమంచిలి, జూన్ 1: ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ఉద్యోగులంతా అప్రమత్తంగా ఉండాలని ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మనోరమ సూచించారు. శనివారం ఇక్కడ ఓట్ల లెక్కింపు విధుల్లో పాల్గొనే ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి, పలు సూచనలు చేశారు. నాలుగో తేదీ ఉదయం 5 గంటలకు కౌంటింగ్ కేంద్రానికి విధిగా చేరుకోవాలన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రారంభం కానుందని, అప్పట్నుంచి సిబ్బంది అంతా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. ఓట్ల కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్వోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు 16 మోటారు సైకిళ్ల పంపిణీ



మత్స్యకారులకు మోటారు సైకిళ్లు అందజేసిన రాంకీ ప్రతినిధులు

అచ్యుతాపురం రూరల్, జూన్ 1 : మండలంలోని కొండకర్ల ఆవ పరిధిలోని 16 మంది మత్స్యకారులకు రాంకీ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం మోటారు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఆర్ కె.రవి శంకర్ మాట్లాడుతూ కొండకర్ల ఆవ ద్వారా జీవనం సాగించే మత్స్యకారులకు ఉపాధిని కలుగజేస్తున్నట్టు తెలిపారు. గత మూడేళ్లలో 300 మంది మత్స్యకారులకు తమ సంస్థ ద్వారా బోట్లు, చేప పిల్లల కొనుగోలుకు ఆర్థిక సాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.శ్రీకాంత్, సీహెచ్ మహేంద్రబాబు పాల్గొన్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ జరుపుకుందాం

» గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా సహకరించండి
» విజయోత్సవాలు నిషేధం » నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు
» అన్ని రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఎస్పీ మురళీకృష్ణ


రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

మాడుగుల, జూన్ 1: సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించుకున్నామని, నాలుగో తేదీ మంగళవారం జరిగే కౌంటింగ్ కూడా అదే వాతావరణంలో సాగేలా అంతా సహకరించాలని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ కోరారు. ఇందుకు రాజకీయ పార్టీల నాయకుల సహకారం ఎంతైనా అవసరమన్నారు. పట్టణంలోని వాసవీమాత కల్యాణ మండపంలో శనివారం అన్ని పార్టీలకు చెందిన నాయకులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కౌంటింగ్ రోజున ఎక్కడా ఎటువంటి గొడవలు, అల్లర్లు జరగకుండా చూడాలని ఎస్పీ వారిని కోరారు. ఎన్నికల నియమావళి అమలులో ఉంటున్నందున అందుకు అనుగుణంగా అంతా నడుచుకోవాలన్నారు. కౌంటింగ్ రోజు సంబరాలు జరుపుకోవడం, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమన్నారు. అలాగే వాట్సాప్‌లలో రెచ్చగొట్టే విధంగా అనవసరమైన పోస్టుంగ్‌లు పెట్టరాదన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజు, కె.కోటపాడు సీఐ బీసీహెచ్ స్వామినాయుడు, మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు, చీడికాడ ఎస్ఐ నారాయణరావు, దేవరాపల్లి ఎస్ఐ నాగేంద్రం, కె.కోటపాడు ఎస్ఐ లక్ష్మీనారాయణ, ఎ.కోడూరు ఎస్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడులో రెండు గంటలు భారీ వర్షం

కె.కోటపాడు, జూన్ 1 : మండలంలో శుక్రవారం అర్ధరాత్రి పన్నెండు గంటల నుంచి భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఉరుములు, మెరుపులతో ఏకధాటిగా పడడంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గత వారం పదిరోజులుగా భానుడి భగభగలతో అల్లాడిపోయిన ప్రజానీకం ఉపశమనం పొందారు. ఈ వర్షం కూరగాయల పంటలకు మేలు చేస్తుందని ఆయా రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రెండు సెంట్ల స్థలాల కోసం ఎదురుచూపులు

» 'అల్యూమినియం' నిర్వాసితులకు పశువుల పాక కోసం ఇస్తామని హామీ
» గత ఎన్నికల ముందు ఇదే నినాదాన్ని అందుకున్న వైసీపీ
» ఐదేళ్లుగా పట్టించుకునేవారు కరువయ్యారని ఆవేదన


పునరావాస కాలనీలో పశువుల పాకల నిమిత్తం పంపిణీకి కేటాయించిన స్థలం

మాకవరపాలెం, జూన్ 1: ఏళ్లు గడుస్తున్నా తమకు ఇవ్వాల్సిన రెండు సెంట్ల స్థలాలు ఇచ్చేవారు కరువయ్యారని అల్యూమినియం కంపెనీ నిర్వాసితులు వాపోతున్నారు. మండలంలో 2007 సంవత్సరంలో అల్యూమినియం కంపెనీ ఏర్పాటు నిమిత్తం రాచపల్లి, కొత్తపాలెం, ధర్మవరం, జి.వెంకటాపురం, జి.కోడూరు గ్రామాలకు చెందిన 2,450 ఎకరాల భూమిని సేకరించారు. ఆ సమయంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇళ్ల స్థలాలతో పాటు పశువుల పాకలకు రెండు సెంట్లు చొప్పున స్థలాలు మంజూరు చేస్తామని నాటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అనంతరం నిర్వాసితులకు తామరం రెవెన్యూలో 150 ఎకరాల భూమిని గుర్తించారు. వాటిలో సుమారు వంద మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు. మిగిలిన స్థలాన్ని పశువుల పాకల నిమిత్తం ఉంచారు. అయితే పశువుల పాకలకు సుమారు 2,400 మంది నిర్వాసితులను గుర్తించినప్పటికీ నేటికీ వారికి స్థలాలను అందించలేదు. వైసీపీ నాయకులు గత ఎన్నికల ముందు రెండు సెంట్లు చొప్పున స్థలాలు పంపిణీ చేస్తామని చెప్పి మొండి చెయ్యి చూపారని ఆయా నిర్వాసితులు వాపోతున్నారు. కొత్తగా వచ్చే ప్రభుత్వమైనా తమ సమస్యను పరిష్కరించాల్సిందిగా వారంతా కోరుతున్నారు.

ప్రశాంతంగా కౌంటింగ్ జరగాలి

... 5వ పేజీ తరువాయి

విధంగా కౌటింగ్ కూడా ప్రశాంతంగా జరిగేలా చూడాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీస్ యాక్ట్ 30, అలాగే 144 సెక్షన్లు అమలులో ఉన్నందున కౌంటింగ్‌కి ముందు, తరువాత జనం గుమిగూడి ఉండకూడదని తెలిపారు. విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు కాల్చడం నిషేధించామన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ నాయకులను చూసుకొని రౌడీషీటర్లు అల్లర్లు, గొడవలు చేస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మోహన్, పట్టణ సీఐ కాంతికుమార్, ఎస్ఐలు పాల్గొన్నారు.

సర్వే సర్వత్రా...

... 5వ పేజీ తరువాయి

మొత్తం 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా అందులో 12 స్థానాలు కూటమికి, 3 వైసీపీకి వస్తాయని పలు సంస్థలు వెల్లడించాయి. అరకులోయ, పాడేరు, మాడుగుల స్థానాలు మాత్రమే వైసీపీకి వస్తాయని, మిగిలినవన్నీ కూటమికే దక్కుతాయని విశ్లేషించాయి. జనసేన పోటీ చేసిన నాలుగు (అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖపట్నం దక్షిణం, పెందుర్తి) సీట్లు గెలుచుకుంటుందని, విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు గెలుస్తారని తెలిపాలి.

'ఆరా' మస్తాన్ ఎగ్జిట్ పోల్స్‌ను వెల్లడిస్తూ రాష్ట్రంలో ప్రముఖులు పోటీ చేసిన చోట ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పారు. ఆయన లెక్కల ప్రకారం విశాఖ జిల్లాలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ (గాజువాక) ఓడిపోతున్నారు. అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసిన డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఓడిపోతారని, కూటమి అభ్యర్థి సీఎం రమేశ్ గెలుస్తారని వెల్లడించారు. విశాఖ ఉత్తరంలో బీజేపీ అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు, వైసీపీ అభ్యర్థి కేకే రాజు నుంచి టైట్ ఫైట్ ఎదుర్కొన్నారని విశ్లేషించారు. విశాఖపట్నం పార్లమెంటు టీడీపీ అభ్యర్థి శ్రీభరత్ గెలుపు ఖాయమని, ఆయనకు మెజారిటీ కూడా భారీగా వస్తుందని పలు సంస్థలు విశ్లేషించాయి.

కూరగాయల ధరలు పైపైకి..

... 5వ పేజీ తరువాయి

అవుతాయి. స్థానికంగా వంకాయలు, గోరుచిక్కుడు, బీరకాయలు కూడా రైతులు మార్కెట్‌కు తీసుకువస్తున్నా అంతంత మాత్రంగానే సరకు రావడం వల్ల డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పటికే పప్పుదినుసులు, నూనెలు, బియ్యం ధరలు ఆకాశాన్నంటగా ఇప్పుడు కూరగాయల ధరలు కూడా పెరిగాయని సామాన్య ప్రజానీకం గగ్గోలు పెడుతోంది.

అనకాపల్లి మార్కెట్‌కు తెల్లవారుజామున నాలుగు గంటలకే ఇతర జిల్లాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు కూరగాయలు తీసుకువచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. ఇక్కడ నుంచే చోడవరం, మాడుగుల, పాడేరు, ఎలమంచిలి తదితర ప్రాంతాల చిరు వ్యాపారులు కూరగాయలను కొనుగోలు చేసి ఆయా గ్రామాల్లో అమ్మకాలకు తీసుకు వెళతుంటారు. అయితే అనకాపల్లిలో రైతు బజారు లేకపోవడం కూడా రైతులు, కొనుగోలుదారులకు శాపంగా మారింది. రైతు బజారు ఉంటే నిర్ణీత ధర ఇటు రైతుకు, అటు కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే అవకాశం ఉంది. రైతు బజారు మంజూరై ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రాకపోవడంతో కూరగాయల రైతులకు కూడా పండిన పంటకు తగిన గిట్టుబాటు ధరలు కొన్ని సందర్భాల్లో రావడం లేదనే ఆవేదన ఉంది. అనకాపల్లి కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేసిన చిరువ్యాపారులు వివిధ ప్రాంతాల్లోని తమ దుకాణాల వద్ద కూడా అధిక ధరలకు అమ్మకాలు సాగిస్తున్నట్టు తెలుస్తోంది.

మంచి లక్ష్యానికి తూట్లు.. పల్లె జనానికి పాట్లు

» పలు పంచాయతీల్లో నిరుపయోగంగా సంపద కేంద్రాలు » గ్రామాల్లో, రోడ్ల పక్కన పేరుకుపోతున్న చెత్తకుప్పలు » పట్టించుకోని పాలకులు


కొండలఅగ్రహారం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న సంపద కేంద్రం


లచ్చన్నపాలెంలో రోడ్డుపై పేరుకుపోయి ఉన్న చెత్తకుప్పలు


మండల పరిషత్ కార్యాలయంలో వృథాగా ఉన్న తడి, పొడి చెత్త సేకరణ బుట్టలు

మాకవరపాలెం, జూన్ 1 : పల్లెలను పరిశుభ్రంగా తీర్చిదిద్ది, తద్వారా పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంపద కేంద్రాలు నేడు చాలా చోట్ల నిరుపయోగంగా మారాయి. వీటిపై వైసీపీ సర్కారు నిర్లక్ష్యం చూపడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఇళ్లలో వాడిన చెత్తా చెదారాన్ని ఆయా పంచాయతీల పారిశుధ్య సిబ్బంది సేకరించి, వాటిని ఊరి శివారులో నిర్మించిన సంపద కేంద్రాలకు తరలించాలి. అక్కడ వాటి ఎరువుగా తయారు చేసి దానిని తిరిగి అదే గ్రామంలోని రైతుల పంట పొలాలకు వినియోగమయ్యేలా విక్రయించాలి. దీని ద్వారా పల్లెల్లో చెత్త సమస్య పరిష్కారంతో పాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యం. ఇందులో భాగంగా గతంలో మాకవరపాలెం మండలంలో 12 గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను నిర్మించారు. మాకవరపాలెం, కొండల అగ్రహారం, జి.గంగవరం, జంగాలపల్లి, పీపీ అగ్రహారం, గిడుతూరు, భీమబోయినపాలెం, రాచపల్లి, జి.కోడూరు, పైడిపాల, తాడపాల తదితర గ్రామాల్లో ఇవి ప్రస్తుతం ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. దీంతో ఆయా పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో చెత్తను రోడ్లపై ఇష్టారాజ్యంగా పారబోస్తున్నారు. ఫలితంగా నివాసితులతో పాటు అటుగా రాకపోకలు సాగించేవారు దుర్వాసనను భరించలేకపోతున్నారు. కొన్నిచోట్ల ఈ చెత్త కుప్పలకు నిప్పు పెడుతుండడంతో ఆ పొగకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇదిలావుంటే, ఐదు నెలల కిందట పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరు చేసేందుకు ఉన్నతాధికారులు ఈ మండలానికి డస్టుబిన్‌లను పంపించారు. ఇవి మండల పరిషత్ కార్యాలయంలో మూలనపడి ఉన్నాయి. దీంతో కొన్ని గ్రామాల్లో చెత్తను రోడ్డుపైన, చెరువుల్లోని, నదుల్లోని పారబోస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకు వచ్చి, తద్వారా గ్రామాల్లో చెత్త సమస్యను పరిష్కరించాల్సిందిగా పలువురు కోరుతున్నారు.

రసాభాసగా మాడుగుల మండల సమావేశం

» తూర్పు కాపులకు బీసీ-డి సర్టిఫికెట్లు ఏవిధంగా మంజూరు చేస్తున్నారని తహసీల్దార్‌ను ప్రశ్నించిన మాజీ ఎంపీపీ రామధర్మజ
» గతంలో ఎంపీటీసీగా పోటీ చేసినప్పుడు, ఎంపీపీగా ఉన్న సమయంలో ఈ విషయం గుర్తుకు రాలేదా.. అంటూ పలువురు ధ్వజం


సమావేశంలో మాజీ ఎంపీపీ, ప్రస్తుత ఇన్‌చార్జి ఎంపీపీ మధ్య వాగ్వాదం

మాడుగుల, జూన్ 1 : ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం జరిగిన మాడుగుల మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశం ప్రారంభం కాగానే ఇన్‌చార్జి ఎంపీపీ తాళ్లపురెడ్డి రాజారాం సమస్యలు, అభివృద్ధిపై మాట్లాడుతుండగా, మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ కలుగజేసుకొని తూర్పు కాపు కులస్తులకు బీసీ-డి సర్టిఫికెట్లు ఏవిధంగా మంజూరు చేస్తున్నారని ప్రశ్నించారు. అసలు దానికి సంబంధించిన జీవో వచ్చిందా.. వచ్చి ఉంటే చూపించాలని తహసీల్దార్ సత్యనారాయణను పట్టుబట్టారు. దీంతో తహసీల్దార్ సమాధానం చెప్పకముందే సభలో ఉన్న కొంతమంది సభ్యులు గళమెత్తారు. గతంలో ఎంపీటీసీగా పోటీ చేసినప్పుడు, ఎంపీపీగా ఉన్న సమయంలో ఈ విషయం గుర్తుకు రాలేదా అంటూ ఆయనను ప్రశ్నించడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. చివరకు తహసీల్దార్ సత్యనారాయణ కలుగజేసుకొని తూర్పుకాపు సర్టిఫికెట్ విషయం కోర్టులో ఉందని, దాని గురించి ఇప్పుడు ప్రస్తావన అనవసరమని తెలిపారు. అనంతరం సభను కొనసాగించి మండలంలో తాగునీరు, వ్యవసాయం, విద్యుత్ వంటి అంశాలపై చర్చించారు. ఎంపీడీవో ఆర్.కాశీప్రసాద్, వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు తదితరులతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి'


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు నర్సింహమూర్తి

మాడుగుల, జూన్ 1 : ఉపాధి హామీ పథకం కూలీలకు రెండు వందల రోజుల పనిదినాలు కల్పించి, రోజు కూలి ఆరు వందల రూపాయలు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరట నర్సింహమూర్తి డిమాండ్ చేశారు. మండలంలో కాశీపురం పంచాయతీ పెదకూర్మం, ద్వారకానగర్, చినకూర్మం గ్రామాల్లో ఉపాధి కూలీలు చేపడుతున్న పని ప్రదేశాలకు శనివారం వెళ్లి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని, పనుల్లో జరుగుతున్న అవకతవకలపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరుకునాయుడు, తలుపులనాయుడు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు ఎర్రమ్మనాయుడుకు నివాళి


ఎర్రమ్మనాయుడు స్థూపం వద్ద నాయకుల నివాళి

కృష్ణాదేవిపేట, జూన్ 1 : సీపీఐ నాయకుడు, గొలుగొండ మాజీ ఎంపీపీ లగుడు ఎర్రమ్మనాయుడు వర్ధంతిని శనివారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థూపం వద్ద గల చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ ఎర్రమ్మనాయుడు సేవలను కీర్తించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎల్‌వీ రమణ, మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, నాయకులు జి.రాధాకృష్ణ, లగుడు శ్రీను, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చోడవరంలో పోలీసులు కార్డన్ సెర్చ్

» సరైన పత్రాలు లేని 51 వాహనాలు సీజ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీసు సిబ్బంది

చోడవరం, జూన్ 1 : పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, సిబ్బంది చీడికాడ రోడ్డులో గల ఐటీఐ కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరిగి వాహనాల రికార్డులను తనిఖీ చేశారు సరైన పత్రాలు లేని 51 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాలుగో తేదీ మంగళవారం ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో విజయోత్సవాలు, బాణసంచా కాల్చడం వంటివి నిషేధమన్నారు. ప్రజలంతా స్నేహభావంతో శాంతియుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల నియమావళిని అతిక్రమించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి

» జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే 'గవిరెడ్డి'


గవిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న బండారు, పీవీజీకుమార్

చీడికాడ, జూన్ 1 : మాడుగుల మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు జన్మదిన వేడుకలను మండలంలోని అప్పలరాజు పురం టీడీపీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం గవిరెడ్డి మాట్లాడుతూ పదవులు ఉన్నా, లేకున్నా ప్రజా సమస్యల పరిష్కా రానికి నిరంతరం తనవంతు కృషి చేస్తానన్నారు. మాజీ మంత్రి, మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తి, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీజీ కుమార్, దేవరాపల్లి టీడీపీ మండల అధ్య క్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, నాయకులు బొబ్బాది తాతారావు, గండి ముసలి నాయుడు, పంచాడ దాలెం నాయుడు, పైలా ముత్యాల నాయుడు, బీశ్ల కోటేశ్వరరావు, కురచా సురేష్, గాడి ప్రసాద్, బొడ్డు శ్రీరా మ్మూర్తి, పాత్రిని జగన్, పాత్రిని మృత్యుం జయ రావు, వంటాకు సూర్యనారాయణ, బండారు దయాకర్, కిల్లి బాలాజీతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

చోడవరం, జూన్ 1 : పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు పొందిన కాపు విద్యార్థులకు ఆదివారం పట్టణంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నామని కార్యక్రమ నిర్వాహకులు ఆకుల రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఏటా చేపడుతున్నట్టు వివరించారు. విద్యార్థులను విద్యలో మరింత ప్రోత్సహించాలన్నదే తమ లక్ష్యంగా పేర్కొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరకులు అందిస్తున్న సత్యసాయి భక్తులు

దేవరాపల్లి, జూన్ 1 : మారుమూల గిరిజన గ్రామం మాకనాపల్లిలో గాజువాక వెంపలి నగర్‌కు చెందిన గల్లా శంకరసాయిరాం ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. అనాగరికంగా ఉన్న ఈ గ్రామాన్ని దత్తత తీసుకొని ప్రతి నెలా ఇక్కడివారికి నిత్యావసరాలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు, తాగునీరు వంటి సమస్య లున్నట్టు గిరిజనులు వివరించారు. ఈ కార్యక్రమంలో రామారావు, సూరిబాబు, మనోహర్, రమేషనాయుడు, లెక్కల సత్యనారాయణ, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి


డ్రాయింగ్ చార్టులను చూపుతున్న విద్యార్థులు

చీడికాడ, జూన్ 1 : హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులు చదువుతో పాటు వివిధ పోటీల్లో రాణించడం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి జోగేశ్వరి అన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా శనివారం చీడికాడ గ్రంథాలయంలో విద్యార్థులు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో హనుమజ్జయంతి


వడ్డాది కూడలిలో స్వామిని దర్శించుకుంటున్న తాతయ్యబాబు


చెట్టుపల్లిలో అలంకరణలో స్వామివారు


రావికమతంలో ఆంజనేయస్వామి ఆలయంలో...

బుచ్చెయ్యపేట, జూన్ 1: హనుమజ్జయంతిని గ్రామ గ్రామాన శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తొలుత అర్చకులు విశేష అలంకరణలు, పూజల అనంతరం దర్శనభాగ్యం కల్పించారు. బుచ్చెయ్యపేట మండలంలోని వడ్డాది కూడలిలో గల స్వామి ఆలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు దొండా నరేష్, బొబ్బాది రాజు, సూరాతి పేరమ్మ, ఎ.కనకరాజు, తలారీ శంకరరావు, దొండా గిరిబాబు, సయ్యపురెడ్డి శ్రీనివాసరావు, వేణు చౌదరి, సాయం శేషు తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

నర్సీపట్నం అర్బన్ : రామదూత హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. నర్సీపట్నంతో పాటు చెట్టుపల్లి, గబ్బాడ, వేములపూడి, మెట్టపాలెం, ధర్మసాగరం, ఓఎల్ పురం గ్రామాల్లో గల ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

గొలుగొండ/కృష్ణాదేవిపేట : మండలంలోని పలు గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నాతవరం : మండలంలో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నాతవరంలో ఆలయ ధర్మకర్త పైల పోతురాజు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. జడ్పీటీసీ సభ్యురాలు అప్పలనర్స, సర్పంచ్ గొలగాని రాణి, అప్పలరాజు తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

మాకవరపాలెం : హనుమజ్జయంతిని మండలవాసులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి ఆలయాలను తీర్చిదిద్దారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, భజనలు చేపట్టారు.

రావికమతం : మండలంలో ఊరూరా హనుమజ్జయంతిని నిర్వహించారు. రావికమతం, చినపాచిల, గుమ్మాళ్ళపాడు, మేడివాడ, అప్పలమ్మపాలెం ,గుడ్డిప, ఎల్ఎన్ పురం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

రోలుగుంట : హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని స్వామివారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. కొమరవోలు, రోలుగుంట, కొండపాలెం, బుచ్చెంపేట, కుసర్లపూడి, కొవ్వూరు, శరభవరం తదితర గ్రామాల్లో ఈ వేడుకలు మరింత ఘనంగా జరిగాయి.

మాడుగుల : మండలంలో అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాడుగుల గాంధీపార్కు, మోదమాంబ కాలనీ, హైస్కూల్ కాలనీల్లో గల ఆంజనేయ స్వామి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

కె.కోటపాడు : హనుమాన్ జయంతిని మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. కింతాడ జోగన్నపాలెంలో శనివారం తెల్లవారుజాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.

దేవరాపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దేవరాపల్లి, తిమిరాం, ములకలాపల్లి, మామిడిపల్లి గ్రామాల్లో గల స్వామివారి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

చీడికాడ : మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమజ్జయంతిని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాల్లో విశేష పూజలు జరిపారు. వీరభద్రునిపేటలో ఆంజనేయస్వామి ఆలయ మూడో వార్షికోత్సవాన్ని నిర్వహించారు. రాజవిశ్వనాథశర్మ ఆధ్వర్యంలో విశేష అర్చనలు చేపట్టారు.